సాక్షి
మహబూబాబాద్
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



వందశాతం ఫలితాలు సాధించాలి
గిరిజన విద్యాసంస్థల్లోని పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. - 8లో



ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఘనత
ఆక్యుపెన్సీ రేషియోలో వరంగల్ రీజియన్ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. - 8లో



వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి



సాక్షి స్పందన

మహబూబాబాద్‌: గృహలక్ష్మి పథకం దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్‌ చైర్మన్‌ రామ్మోహన్‌రెడ్డి బిల్‌ కలెక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్‌ ప్రక్రియలో తీవ్రజాప్యం జరుగుతోందని ఆగస్టు 30న సాక్షి దినపత్రికలో 'నత్తనడకన గృహలక్ష్మి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్‌ చైర్మన్‌ స్పందించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం బిల్‌ కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ.. దరఖాస్తుల పరిశీలనతో పాటు ఆన్‌లైన్‌ ప్రక్రియ కూడా వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ ప్రసన్నరాణి, మేనేజర్‌ శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌ రిక్రూట్‌మెంట్‌

మహబూబాబాద్‌: భారత వైమానిక దళం (ఇండియన్‌ ఎయిర్‌ఫోర్స్‌)లో అవివాహిత, భారతీయ పురుష అభ్యర్థులు అగ్ని వీర్‌ వాయు (సంగీకారుడు)గా నాలుగు సంవత్సరాలు పనిచేయడానికి ఓపెన్‌ రిక్రూట్‌మెంట్‌ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్‌డీఎస్‌వి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15, 16వ తేదీల్లో బేగంపేటలోని ఎయిర్‌ఫోర్స్‌ స్టేషన్‌లో ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు. నాలుగు సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఇండియన్‌ ఎయిర్‌ఫోర్స్‌ రెగ్యులర్‌ కేడర్‌లో ఎయిర్‌మెన్‌గా నమోద్‌ చేసుకోవడానికి అగ్రివీర్‌వాయుకు అవకాశం కల్పిస్తారన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత, సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. సంగీత అనుభవం సర్టిఫికెట్‌, ఇతర పత్రాలు ఉండాలన్నారు. ఆ తేదీల్లో ఉదయం ఆరుగంటల వరకే రిపోర్ట్‌ చేయాలని, పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

మానుకోట డిపోకు అదనపు ఆదాయం

నెహ్రూసెంటర్‌: రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని మహబూబాబాద్‌ డిపో ఆధ్వర్యంలో అదనపు బస్సు సర్వీసులను నడపడం వల్ల ఆర్టీసీకి అత్యధిక ఆదాయం సమకూరిందని డిపో మేనేజర్‌ విజయ్‌ శుక్రవారం తెలిపారు. మహిళా ప్రయాణికులు, ప్రయాణికులు ఆదరించడం వల్ల 26, 277 కిలోమీటర్లు బస్సులు తిరుగగా రూ.15,52,823 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమష్టి కృషి వల్లే సాధ్యమైందని అన్నారు. అనంతరం డిపో ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు.

యూపీహెచ్‌సీ నిర్మాణానికి ఉత్తర్వులు జారీ

నెహ్రూసెంటర్‌: అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ (యూపీహెచ్‌సీ) నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం, ఆరోగ్యశాఖ కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా కేంద్రంలో అర్బన్‌ పీహెచ్‌సీ నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటి వరకు అద్దె భవనంలో కొనసాగుతున్న యూపీహెచ్‌సీకి సొంత భవనం నిర్మాణం చేసి వైద్య సేవలను అందించనుండగా, భవన నిర్మాణం కోసం అధికారులు స్థల సేకరణ చేపడుతున్నారు.

ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేయాలి



మరిపెడ: ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేయాలని తొర్రూరు ఆర్డీఓ నర్సింహ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు సవరణ, నూతన ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. నేడు, రేపు గ్రామ పంచాయతీల్లోని పోలింగ్‌ స్టేషన్‌లలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు సవరణతో పాటు 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 18సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలని చెప్పారు. పంచాయితీ కార్యదర్శులు గ్రామాల్లో టాంటాం వేసి ఓటరు నమోదు పెంచాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, తహసీల్దార్‌ సైదులు, ఎంపీడీఓ ధన్‌సింగ్‌, పోలీస్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలు.. బేఖాతర్‌..!

- కాగితాలకే పరిమితమైన ఉపాధ్యాయుల సర్దుబాటు
- కలెక్టర్‌ ఆదేశాలు ఇచ్చి నెలరోజులు దాటినా సగం మంది నిర్లక్ష్యం
- రాజకీయ నాయకుల నుంచి అధికారులకు ఫోన్లు, బెదిరింపులు
- ఉపాధ్యాయులు లేక పలు పాఠశాలల్లో సాగని పాఠాలు
- ఉన్నతాధికారికి నివేదిక ఇవ్వడంలో యంత్రాంగం విఫలం



సాక్షి, మహబూబాబాద్‌: జిల్లాలో ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు కాగితాలకే పరిమితమైంది. ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు వెళ్లాలని టీచర్లకు వేసిన డిప్యుటేషన్లు సరిగా అమలు కావడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలను గౌరవించి కొందరు పాఠశాలలకు వెళ్లి పాఠాలు చెబుతుండగా.. మరికొందరు ఆదేశాలను లెక్కచేయడం లేదు. ఆర్డర్స్‌ వచ్చి నెలరోజులు గడిచినా ఇప్పటికీ డిప్యుటేషన్‌ వేసిన పాఠశాలలకు వెళ్లడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. కాగా ఇప్పటి వరకు ఆయా పాఠశాలలకు వెళ్లని ఉపాధ్యాయుల జాబితా ఇవ్వాలని మండలస్థాయి అధికారులకు చెప్పినా.. సమాచారం ఇవ్వడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారులు వాపోతున్నారు.

కొరత ఉన్న పాఠశాలలకు..

జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో 3,690 మంజూరు టీచర్‌ పోస్టులు ఉన్నాయి. వీటిల్లో 3,126 మంది పనిచేస్తున్నారు. 564 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటితో పాటు 153 పాఠశాలల్లో విద్యార్థులు లేరనే నెపంతో 170 మందికి పైగా ఉపాధ్యాయులు వేరే పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మొత్తంగా 223 మందిని తాము పనిచేస్తున్న చోటు నుంచి అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు.

నెలరోజులు గడిచినా..

ప్రతి సంవత్సరం బడిబాట కార్యక్రమం పూర్తి కాగానే ఉపాధ్యాయుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారు. లేదా విద్యా వలంటీర్లను నియమిస్తారు. అయితే మూడు సంవత్సరాల నుంచి విద్యా వలంటీర్లను నియమించడం లేదు. కాగా పలు పాఠశాలల్లో సబ్జెక్ట్‌ టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు పుస్తకాలు కూడా తెరవని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులను నిలదీశారు. టీసీలు ఇవ్వాలని, తమ పిల్లలను వేరే పాఠశాలలకు పంపుతామని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్‌ శశాంక డిప్యుటేషన్‌ ఫైల్‌ తెప్పించి సంతకం చేశారు. మరుసటి రోజు నుంచి ఉపాధ్యాయులు తమకు కేటాయించి పాఠశాలకు వెళ్లాలని పేర్కొన్నారు. ఇలా 223 మందికి ఆదేశాలు జారీ చేయగా.. ఇప్పటి వరకు వంద మందికి పైగా ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలకు వెళ్లడం లేదని తెలిసింది.

అధికారులకు బెదిరింపులు..

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను పలువురు ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కొందరు ఉపాధ్యాయులు జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ నాయకులతో ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఏకంగా ఓ ప్రజా ప్రతినిధి మావాడి జోలికి వస్తే నీ అంతు చూస్తానని జిల్లా అధికారిని బెదిరించినట్లు సమాచారం.

డిప్యుటేషన్‌పై వెళ్లకుంటే చర్యలు తీసుకుంటాం..



ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి నెలరోజులు దాటింది. కానీ కొందరు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై వెళ్లలేదని ఫిర్యాదులు వచ్చాయి. పూర్తి వివరాలతో జాబితా ఇవ్వాలని ఎంఈఓలను ఆదేశించా. కానీ వారు కూడా ఆలస్యం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను గౌరవించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం.

- రామారావు, డీఈఓ

ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ గుండేటి చంద్రమోహన్



మాట్లాడుతున్న ఎస్పీ చంద్రమోహన్

మహబూబాబాద్‌ రూరల్‌: జిల్లా పరిధిలో షీ టీంలు అధికారుల పర్యవేక్షణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా పని చేస్తున్నాయని ఎస్పీ గుండేటి చంద్రమోహన్‌ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ చంద్రమోహన్‌ షీ టీంల పనితీరుపై మాట్లాడారు. కళాశాలలు, పాఠశాలల్లో చదివే విద్యార్థినులు, మహిళలకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీంలు ఆకతాయిలు ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నాయన్నారు. రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, విద్యాసంస్థలు, దేవాలయాల పరిసర ప్రాంతాల్లో షీ టీం పోలీసులు మఫ్టీలో ఉంటూ ఆకతాయిలకు చెక్‌ పెడుతున్నారని తెలిపారు. మహబూబాబాద్‌, తొర్రూరు సబ్‌ డివిజన్‌ పరిధిలో షీ టీం పోలీసులు ఆ శాఖ పనితీరుపై బస్టాండ్‌, రైల్వే స్టేషన్‌, ముఖ్య కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు అందుబాటులో ఉందని, క్యూఆర్‌ కోడ్‌ ద్వారా ఉన్న చోటు నుంచే వేధింపులపై నిమిషాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పోటీపడి పనిచేస్తున్నారని, తాము పనిచేస్తున్న రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారని, అలాంటి వారికి షీ టీంలు ఎల్లప్పుడు అండగా నిలుస్తూ ధైర్యం ఇస్తున్నాయన్నారు. ఆకతాయిలు వెంటపడి వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100, 112తో పాటు 79011 42009, 87126 56935 వాట్సాప్‌ నంబర్లలో సంప్రదించాలన్నారు. జిల్లా పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాఠశాలలు, కళాశాలల వద్ద షీ టీం ఫోన్‌ నంబర్లు తెలిసేలా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆకతాయిల వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు నిర్భయంగా ముందుకు రావాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రెండో ఏఎన్‌ఎంల భిక్షాటన



మానుకోటలో భిక్షాటన చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

నెహ్రూసెంటర్‌: ప్రభుత్వం తమను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ రెండో ఏఎన్‌ఎంలు జిల్లా కేంద్రంలో శుక్రవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్ర శ్రావణ్‌, రెండో ఏఎన్‌ఎంల యూనియన్‌ నాయకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లలో భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్నామన్నారు. సమ్మె చేపట్టి 17రోజులు కావస్తున్నా సీఎం కేసీఆర్‌, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి నోటిఫికేషన్‌ లేకుండా రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శంకర్‌, రవీంద్ర, శ్రీనివాస్‌ వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు అశ్విని, సువర్ణ, సుమలత, భద్రమ్మ, విజయ, సరిత, సుశీల, కల్యాణి, కృష్ణవేణి, సునీత, శోభ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'దళితబంధు' ఇవ్వాలి

- ధర్నా చేసిన సర్పంచ్‌



అర్హులకు దళితబంధు ఇవ్వాలని జీపీ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచ్‌ రాంబాబు

కురవి: మండలంలోని తిర్మలాపురం గ్రామంలో సర్పంచ్‌ కొర్ని రాంబాబు ఆధ్వర్యంలో అర్హులైన దళితులకు దళితబంధు పథకం ఇవ్వాలని, గృహలక్ష్మి పథకంలో గృహాలు కేటాయించాలని శుక్రవారం జీపీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తిర్మలాపురం గ్రామానికి ఎమ్మెల్యే డీఎస్‌ రెడ్యానాయక్‌ గృహలక్ష్మి పథకం కింద 10 ఇళ్లు, ఏడు దళితబంధు యూనిట్లు ఇచ్చారని సర్పంచ్‌ రాంబాబు తెలిపారు. ఎంపిక విధానం ఇష్టానుసారంగా చేశారని వివరించారు. గ్రామానికి చెందిన బీసీ నాయకుడు అనర్హులను దళితబంధు పథకానికి ఎంపిక చేశారని, ఒక్కో యూనిట్‌ను ఐదారుగురికి కేటాయించారని తెలిపారు. దళిత సర్పంచ్‌, ముగ్గురు దళిత వార్డు సభ్యులున్నారని, పంచాయతీ పాలకమండలిని లెక్కచేయకుండా ఎంపిక చేశారని ఆరోపించారు. అర్హులైన పేదలను ఎంపిక చేసి డ్రా పద్ధతిలో పథకం కేటాయించాలని, ఎంపీడీఓ, కలెక్టర్‌ ద్వారా ఎంపికలుండాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కొత్తపల్లి మహేష్‌, కొర్ని శ్రవణ్‌, కొత్తపల్లి ప్రభాకర్‌, దేవి శ్రీను, పూల సులోచన, కొత్తపల్లి సంపత్‌, రమేష్‌, మహేందర్‌ పాల్గొన్నారు.

నియామక పత్రాలు సిద్ధం!

- 246మందితో జాబితా తయారు
- రెండు రోజుల్లో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులకు పత్రాలు అందించనున్నట్లు సమాచారం
- కోల్పోయిన సర్వీస్‌, పేస్కేల్‌పై స్పష్టత లేకపోవడంతో జేపీఎస్‌ల అసంతృప్తి



మహబూబాబాద్‌: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్‌) రెగ్యులరైజేషన్‌ ప్రక్రియ పూర్తయింది. ఆగస్టు 30వ తేదీవరకు నాలుగు సంవత్సరాల ప్రొబేషన్‌ పూర్తి చేసుకున్న జిల్లాలోని 246 మందికి గ్రేడ్‌-4 పంచాయతీ సెక్రటరీలుగా గుర్తిస్తూ త్వరలోనే నియామక పత్రాలు అందజేయనున్నారు. అయితే రెగ్యులరైజేషన్‌ చేసినప్పటికీ కోల్పోయిన సర్వీస్‌పై జేపీఎస్‌లు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పేస్కేలుపై స్పష్టత లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

నాలుగేళ్ల తర్వాత..

నోటిఫికేషన్‌ నిబంధనల ప్రకారం పనితీరును ప్రమాణికంగా చేసుకొని మూడు సంవత్సరాలకు జేపీఎస్‌లను రెగ్యులరైజ్‌ చేయాలి. అయితే నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ రెగ్యులరైజ్‌ చేయకపోవడంతో గత ఏప్రిల్‌లో 16 రోజులు సమ్మె చేసి ప్రభుత్వ హామీతో విరమించారు. ఈక్రమంలో జూలైలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం కేసీఆర్‌ జేపీఎస్‌ రెగ్యులరైజేషన్‌ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉండగా 356 మంది జేపీఎస్‌లు పని చేస్తుండగా.. ఇందులో 10 మంది అవుట్‌ సోర్సింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

246మందితో జాబితా సిద్ధం..

జిల్లాస్థాయి పర్ఫామెన్స్‌ కమిటీ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న 246 మంది జేపీఎస్‌ల పనితీరును పరిశీలించింది. వీనికి గ్రేడ్‌-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. కాగా మిగిలిన 110మంది జేపీఎస్‌ల ప్రొబేషనరీ కాలం పూర్తికాలేదు. దీంతో వారికి పదోన్నతి కల్పించలేదు. కాగా మరోరెండు రోజుల్లో పదోన్నతి పొందిన జేపీఎస్‌లకు నియామక పత్రాలు అందజేస్తారని సమాచారం. కాగా కోల్పోయిన సర్వీస్‌, పేస్కేల్‌పై స్పష్టత లేకపోవడంతో వారు కాస్త అసంతృప్తితో ఉన్నారు.

మండలాల వారీ రెగ్యులరైజ్‌ అయినే జేపీఎస్‌ల సంఖ్య

మండలం	జేపీఎస్‌	మండలం	జేపీఎస్‌
తొర్రూరు	22	కొత్తగూడ	2
పెద్దవంగర	13	గూడూరు	12
నెల్లికుదురు	26	గార్ల	2
నర్సింహులపేట	14	డోర్నకల్‌	23
మరిపెడ	29	దంతాలపల్లి	7
మహబూబాబాద్‌	28	చిన్నగూడూరు	8
కేసముద్రం	27	బయ్యారం	1
కురవి	32	మొత్తం	246

రెగ్యులరైజేషన్‌ను స్వాగతిస్తున్నాం..



రెగ్యులరైజేషన్‌ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. పర్ఫామెన్స్‌ ప్రక్రియను త్వరగా పూర్తి చేసిన అధికార యంత్రానికి ధన్యవాదాలు. గ్రామాలకు అవార్డులు తీసుకురావడం కోసం నిరంతరం శ్రమిస్తున్నాం. అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు సంవత్సరాలు చేసిన పనిని స్వరీస్‌ కాలంగా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- చుక్కల ప్రవీణ్‌ , టీజేఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు

ఫస్ట్‌ క్లాస్‌ రైల్వే స్టేషన్‌గా మానుకోట..

- డీఆర్‌ఎం భరతేష్‌ కుమార్‌ జైన్‌



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

మహబూబాబాద్‌ రూరల్‌ : ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తూ మహబూబాబాద్‌ రైల్వే స్టేషన్‌ మరో నాలుగైదు నెలల్లో మొదటి తరగతి (ఫస్ట్‌ క్లాస్‌) రైల్వే స్టేషన్‌గా రూపాంతరం చెందనుందని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌ డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ (డీఆర్‌ఎం) భరతేష్‌ కుమార్‌ జైన్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మహబూబాబాద్‌ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో మహబూబాబాద్‌ చేరుకున్న ఆయన.. అమృత్‌ భారత్‌ పథకంలో భాగంగా రూ.39.7 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌ మాస్టర్‌ గది, ఇతర కార్యాలయాలలో సిబ్బంది పనితీరుపై వాకబు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ నాలుగైదు నెలల్లో రైల్వే స్టేషన్‌ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ట్రాక్‌ మరమ్మతులు, మూడో రైల్వే ట్రాక్‌ నిర్మాణంతో ప్యాసింజర్‌ రైళ్లను రద్దు చేశామని, మరమ్మతులు పూర్తి కాగానే పునరుద్ధరిస్తామని తెలిపారు. అనంతరం ప్రత్యేక రైలులో మహబూబాబాద్‌ నుంచి కాజీపేట వరకు రైల్వే ట్రాక్‌ పనితీరును పరిశీలించారు. ఈ తనిఖీల్లో రైల్వే ఉన్నతాధికారులు కృష్ణారెడ్డి, సజ్జా, ప్రియా అగర్వాల్‌, సురేష్‌, బసవరాజ్‌, రాజగోపాల్‌, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ మోహన్‌ కుమార్‌, స్టేషన్‌ పర్యవేక్షకుడు కనకరాజు పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధి పనుల పరిశీలన

డోర్నకల్‌: డోర్నకల్‌ రైల్వే జంక్షన్‌ పరిధిలో దక్షిణ మధ్య రైల్వే డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ భరతేష్‌కుమార్‌ జైన్‌ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా జంక్షన్‌ పరిధిలోని రైల్వే స్టేషన్‌, రన్నింగ్‌ రూం, గూడ్స్‌ యార్డు, ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం, సీఅండ్‌ డబ్ల్యూ డిపోతో పాటు ఇతర శాఖల పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం డీఆర్‌ఎంను మాజీ డీఆర్‌యూసీసీ సభ్యుడు ఖాదర్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు కాలా సుమీర్‌చంద్‌జైన్‌, కాలా మహేందర్‌జైన్‌, కిశోర్‌కుమార్‌జైన్‌, యశోధర్‌జైన్‌, తదితరులు కలిశారు.ఈ సందర్భంగా రైళ్ల పునరుద్ధరణ, పలు రైళ్ల హాల్టింగ్‌పై వినతిపత్రాలు సమర్పించారు. పుష్‌పుల్‌తో పాటు ఇతర ప్యాసింజర్‌ రైళ్లను వెంటనే పునరుద్ధరించాలని, పద్మావతితో పాటు ఇతర ఎక్స్‌ప్రెస్‌ రైళ్లకు డోర్నకల్‌లో హాల్ట్‌ కల్పించాలని కోరగా డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సీనియర్‌ డీఈఎన్‌(కోఆర్డినేషన్‌) కృష్ణారెడ్డి, డీఎంఈ శ్రీనివాస్‌, డీసీఏ బస్వరాజ్‌, ఏడీఈఎన్‌ ప్రకార్‌ సింగ్‌, స్టేషన్‌ సూపరింటెండెంట్‌ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబాబాద్‌ అర్బన్‌: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ నిర్వహిస్తున్నట్లు డీఈఓ రామారావు శుక్రవారం తెలిపారు. ఇటీవల భర్తీ చేయగా మిగిలిన 10 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఇందుకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు వెరిఫికేషన్‌ ప్రక్రియ చేపడుతామన్నారు. ఇటీవల ప్రకటించిన మెరిట్‌ జాబితా ఆధారంగా ప్రక్రియ జరుగుతుందని, వాట్సాప్‌, ఎస్‌ఎంఎస్‌ ద్వారా సమాచారం అందుకున్న అభ్యర్థులు మాత్రమే వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు.

పంటలను రక్షించుకోవాలి



మిర్చి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

మరిపెడ రూరల్‌: ఎండ వేడిమి నుంచి పంటలను రక్షించుకోవాలని కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు క్రాంతికుమార్‌, రాంబాబు అన్నారు. మరిపెడ మండలం గిరిపురం గ్రామ శివారులో రైతులు సాగు చేసిన మిర్చి, పత్తి, వరి పంటలను క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చీడపీడలు, నీటి ఎద్దడితో మిర్చి తోటలు ఎండిపోతున్నాయన్నారు. మిర్చి తోటలకు సాయంత్ర 6 గంటల తర్వాత, ఉదయం 10 గంటల ముందుగా నీళ్ల పారించాలని రైతులకు సూచించారు. అయినప్పటికీ మిర్చి మొక్కలు చనిపోతే సంబంధిత పురుగు మందును నీటిలో కలిపి మొక్క అడుగు భాగంలో పోసుకోవాలన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తేనే పంటలు కాపాడుకునే అవకాశం ఉంటుందని, దీంతో దిగుబడి సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు, మండల వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్‌, ఏఈఓ శ్రీకాంత్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు

- డీఎంహెచ్‌ఓ అంబరీష



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

నెహ్రూసెంటర్‌: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ అంబరీష హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ, పీసీపీఎన్‌డీటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసాలు ఉండొద్దని, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. సమాజంలో ఆడ శిశువులను చంపడం చట్టరీత్యా నేరమని, స్కానింగ్‌ సెంటర్లపై నిఘా పెంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి, సీడీపీఓ డేబోరా, పీఓ నరేష్‌, కేవీ రాజు, డీపీఎం రుక్ముద్దీన్‌, పృథ్వీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడానికి సిద్ధం కావాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

నెహ్రూసెంటర్‌: దేశంలో లౌకికశక్తులను సమీకరించి బీజేపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.నాగయ్య మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో అన్ని రాష్ట్రాల్లో మతోన్మాదం పెరిగిపోయిందని, ప్రజల ఆర్థిక, ప్రాణ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కేసీఆర్‌ ప్రభుత్వం ఒక్కటయ్యాయని, రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ ఇప్పటి వరకు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు నటించారని, తన కూతురు కేసు నిలుపుదల కోసం బీజేపీ సర్కార్‌తో రాజీపడ్డారని ఆరోపించారు. మునుగోడు ఎన్నికల్లో కమ్యూనిస్టుల అండతో గెలిచానని, మిత్రుత్వం కొనసాగుతుందని చెప్పిన సీఎం కేసీఆర్‌ ఒంటరిగా సీట్లు ప్రకటించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. వామపక్షాలు, కాంగ్రెస్‌ పొత్తుపై త్వరలో ప్రకటిస్తామని, భవిష్యత్‌లో కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని నాగయ్య తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు..

పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలకు సిద్ధమవుతున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌ అన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి నిరసనలు, ధర్నాలు, ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 17వ తేదీన సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, శెట్టి వెంకన్న, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, కందునూరి శ్రీనివాస్‌, ఆంగోత్‌ వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనాలు నిలిపివేత..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2010 సంవత్సరంలో వివిధ విభాగాల్లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఆగస్టు నెలకు సంబంధించిన వేతనాలను యూనివర్సిటీ అధికారులు నిలిపివేశారు. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి తుదినిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం నియమించిన ఐదుగురితో కూడిన కమిటీ జీవో 248ని ఇటీవల హైకోర్టు రద్దుచేసిన విషయం విధితమే. వీరి నియమాకానికి సంబంధించి తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సింటుంది. 2019 నవంబర్‌లో వీరి నియమకాన్ని పూర్తిస్తాయి కేయూ పాలకమండలి ఆమోదించలేదు. అప్పటి అధికారులు తుది నిర్ణయం కోసం ప్రభుత్వానికి ఫైల్ పంపారు. ప్రభుత్వం నియమించిన కమిటీ జీవోను హైకోర్టు రద్దు చేశారని వీరి వేతనం నిలిపివేయాలని అప్పట్లో ఉద్యోగం రాని వినిత నాయిని యూనివర్సిటీ అధికారులకు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. దీంతో యూనివర్సిటీ అధికారులు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలు నిలిపివేయడంతో ఆందోళన చెందుతున్నారు. వేతనాలు రాని ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొందరు శుక్రవారం కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును కలిసి వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, చీఫ్ విఫ్ దాస్యం వినయభాస్కర్‌ను కూడా ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

‘బీఆర్‌ఐ’ తరలింపు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా ఉన్న బీఆర్‌ఐ (బ్రిడ్జిస్ ఇన్‌స్పెక్టర్) నార్త్ కార్యాలయం, బీఆర్‌ఐ (బ్రిడ్జిస్ ఇన్‌స్పెక్టర్) సౌత్ కార్యాలయం తరలింపును రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. కాజీపేటలో ఉన్న రెండు బీఆర్‌ఐ కార్యాలయాల్లో నార్త్ కార్యాలయం విడదీసి మంచిర్యాలలో బీఆర్‌ఐ సబ్ యూనిట్ కార్యాలయం, సౌత్ కార్యాలయం విడదీసి భద్రాచలంలో బీఆర్‌ఐ సబ్ యూనిట్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ఆయా కార్యాలయాలు తరలింపుతో కాజీపేట జంక్షన్‌ను తీవ్ర నష్టం జరుగుతుందనే అంశంపై మీడియాలో కథనాలు ప్రచురితకావడంతోపాటు రైల్వే జేఏసీ నాయకులు నిరసన చేపట్టారు. దీనిపై స్పందించి ప్రస్తుతం తరలింపును రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆ రోజు నేను తప్పించుకున్నా..

నా ముందు వరుసలో ఉన్నోళ్లు బలయ్యారు..

- ఉద్యమకారులపై కురిసిన తుపాకుల తూటాలు
- ఆ తర్వాత అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారు..
- చనిపోయానని రజకార్లు వెళ్లిపోయారు..
- 1947 సెప్టెంబర్ 2 పరకాల ఘటనను గుర్తు చేసిన చంద్రారెడ్డి
- చాపలబండ రక్తసిక్తమై నేటికి 76 ఏళ్లు



రేగూరి చంద్రారెడ్డి

పరకాల: తెలంగాణ సాయుధ పోరాటంలో 1947 సెప్టెంబర్ 2న పరకాలలో జరిగిన పోరాటం చిరస్మరణీయంగా నిలిచింది. ఎంతో మంది ఉద్యమకారుల వీరమరణంతో పరకాల నేల రక్తసిక్తమై నేటికి 76 ఏళ్లు. మరో జలియన్‌వాలా బాగ్‌గా పిలిచే నాటి పోరాటంలో పాల్గొన్న వ్యక్తి పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన 98 ఏళ్ల పోలీస్‌పటేల్ రేగూరి చంద్రారెడ్డి. పోలీస్‌గా పనిచేసిన ఆయన తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్శితులై నిజాం సర్కారుపై తిరుగుబావుటా ఎగురవేశారు. పరకాలలో ఆ రోజు ఏం జరిగింది.. అంత మారణహోమం జరగడానికి దారి తీసిన పరిస్థితులపై శుక్రవారం ఆయన ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణలో రజాకార్ల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోయేది. గ్రామాల ప్రజలు రాత్రింబవళ్లు నిద్రహారాలు మానేవారు. ఎప్పుడు ఏ గ్రామంపైనా.. ఎవరిని ఏం చేస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది. నేను నిజాం సర్కార్‌లోనే పోలీస్ పటేల్‌గా పనిచేసేవాడిని. అప్పటిపరిస్థితులను చూసి ఉద్యోగాన్ని వదిలిపెట్టి మారుపేరు రంజిత్‌తో తిరుగుబాటుదారులైన ఎస్.మనోహార్‌రావు, కేవీనర్సింగరావుకు సన్నిహితమయ్యా. వారి పోరాట కార్యాచరణలో భాగస్వాముడినయ్యాను. సాయుధ ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో దామెర మండలంలోని చంద్రగిరి గుట్టలను షెల్టర్‌గా మార్చుకొని నిజాం పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల ఆగడాలపై సాయుధపోరుకు శ్రీకారం చుట్టాం.

మూడు కిలోమీటర్ల పొడవుతో సాగిన ఊరేగింపు

ఆ రోజు 1947 సెప్టెంబర్ 2. అజ్ఞాతంలోకి వెళ్లిన నేతల పిలుపు మేరకు నిజాం నిరంకుశ పాలనను, రజకారులను ఎదిరిస్తూ త్రివర్ణ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి అనేక గ్రామాలనుంచి వేలాది మంది ప్రజలు పరకాలకు తరలివచ్చారు. యూనియన్ పతాకాలు, వడిసేలు, చేతి కర్రలు చేతబూని పతాక వందనానికి కదం తొక్కారు. తొలుత చాపలబండ నుంచి దగ్గ వీరగోపాల్‌రావు నాయకత్వాన ఊరేగింపు నిర్వహించాం. మూడు కిలోమీటర్ల పొడవుతో సాగిన మా ఊరేగింపులో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలవాలని, వందే మాతరం అంటూ నినాదాలు చేశాం.

గర్జించిన నిజాం పోలీసుల తుపాకులు

మా ఊరేగింపు సమాచారం తెలియగానే అప్పటికే ఇక్కడ నిజాం మిలిటరీ పోలీసులు మకాం వేశారు. రజాకారులు కత్తులు, బరిసెలతో సిద్ధమై ఉన్నారు. తహసీల్దార్ విష్ణువేశ్వర్ రావు ఊరేగింపు వద్దకు వచ్చి వెనక్కి తిరిగి రావాల్సిందిగా మా అందరికి(ఉద్యమకారులకు) హెచ్చరికలు జారీ చేశారు. ఉద్రేకం, ఉత్సాహంగా ఊరేగింపు చేస్తున్న మేం తహసీల్దార్ హెచ్చరికలను ఖాతరు చేయలేదు. ఆగ్రహంతో ఊగిపోతూ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జియా ఉల్లా మాపై మరింత బలగాలను మోహరించారు. తహసీల్దార్ అనుమతి మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చేతిలోని పిస్టోల్ ధన్‌మని పేలడంతో నిజాం పోలీసుల తుపాకులు గర్జించాయి. మా కంటే ముందు వరుసలో ఉన్న శ్రీశైలంతోపాటు అనేక మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చాపలబండ ప్రాంతం రక్తంతో తడిసిముద్దయింది. అక్కడినుంచి నేను తప్పించుకున్న. వారం రోజులకు నన్ను దొరకబట్టి చిత్రహింసలకు గురిచేశారు. చనిపోయాడనుకొని వెళ్లిపోయారు. కానీ కొన ఊపిరితో బయటపడ్డాను. నాటి ఉద్యమ ఫలితంగా తెలంగాణకు విముక్తి లభించడం ఎంతో సంతోషం ఇచ్చింది.

వందశాతం ఫలితాలు సాధించాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: గిరిజన విద్యాసంస్థల్లో టెన్త్ విద్యార్థులు వందశాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని, దీనికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కృషి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ కోరారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగామ డిప్యూటీ డైరెక్టర్లతో పీఓ సమీక్ష నిర్వహించారు. 2023–24వ సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ముందుగా గత సంవత్సర పదో తరగతి ఫలితాలను పాఠశాలల వారీగా సమీక్షించారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి..

ఈ సంవత్సరం 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. ఇందులో భాగంగా మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల నుంచి సత్ఫలితాలు రాబట్టడానికి ‘మ్యాచింగ్.. బ్యాచింగ్’ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అదేవిధంగా మ్యాథమెటిక్స్‌లో తక్కువ ఫలితాలు నమోదు చేసిన పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏసీఎంఓలకు సూచించారు. ప్రతి పాఠశాలలో కనీసం ముగ్గురు విద్యార్థులను జీపీఎస్ 10/10 సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు పోచం, మంకీడి ఎరయ్య, ఏటీడీవోలు దేశిరాం, భాస్కర్, ఏసీఎంఓలు రవీందర్, హీరాలాల్, శ్రీరాములు, రవిశంకర్, జీసీడీఓ సుగుణ, ఆర్పీలు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, తేజ, సంపత్ కుమార్, చెంచయ్య, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ఆహ్వానం

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లా పెంబర్తిలోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా కళాశాలలో హిస్టరీ సబ్జెక్టు బోధించేందుకుగాను గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్‌వీఎస్‌చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866610429 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మెస్ కార్డులను రెన్యూవల్ చేసుకోవాలి

కేయూ క్యాంపస్: కేయూలో వివిధ పీజీ, ప్రొఫెషనల్‌కోర్సుల విద్యార్థులు 2023–24 సంవత్సరానికి హాస్టల్ మెస్ కార్డుల రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలని హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య, అదనపు డైరెక్టర్ సుచిరిత పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 4 నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత కళాశాల రశీదు, పాత మెస్ కార్డులు అందించాలన్నారు. స్కాలర్‌షిప్ దరఖాస్తు, మెస్‌బకాయిల చెల్లింపు రశీదులను క్యాంపస్‌లోని హాస్టళ్ల ఆఫీస్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

నీవు చస్తే.. మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటా..

- పెళ్లయిన ఆరు నెలలకే భర్త వేధింపులు
- మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య
- మృతురాలు రెండు నెలల గర్భిణి


అర్చన (ఫైల్)

రఘునాథపల్లి: వారికి పెళ్లయి ఆరు నెలలైంది. ఆమె రెండు నెలల గర్భిణి. కానీ భర్త.. మరో అమ్మాయితో చనువుగా ఉన్న ఫొటోలను చూసి ఇదేమిటని అడిగితే

‘నీవు చస్తే.. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా. ఉరి వేసుకొని చావు’ ..అంటూ ఈసడించుకోవడంతో మనస్తాపానికి గురైన వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దూరి కృష్ణ–రేణ దంపతుల కుమార్తె అర్చన అలియాస్ హర్షిణి (20)ని పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మల్యాల అంజనేయులు కుమారుడు వినేష్‌కు ఈ ఏడాది మార్చి 10న ఇచ్చి వివాహం జరిపారు. 20 రోజుల క్రితం అర్చనను భర్త, తల్లి కలిసి జనగామలోని ఓ అస్పత్రికి తీసుకెళ్లి చూపించగా రెండు నెలల గర్భిణిగా వైద్యులు నిర్ధారించారు. అక్కడి నుంచి అర్చనను భర్త వినేష్ తన ద్విచక్రవాహనంపై పుట్టింటికి తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. గత నెల 31న వినేష్ భార్య వద్దకు చేరుకున్నాడు. భర్త సెల్‌ఫోన్‌ను అర్చన పరిశీలిస్తుండగా వినేష్ మరో యువతితో సాన్నిహిత్యంగా ఉన్న ఫొటోలను గుర్తించింది. ఆ అమ్మాయి ఎవరు అని నిలదీయగా ‘నీవు చస్తే.. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా, ఉరి వేసుకొని చావు’ ..అంటూ కోపంతో భర్త వెళ్లిపోయాడు. దీంతో అర్చన తీవ్ర మనోవేదనకు గురైంది. శుక్రవారం ఉదయం భర్త వినేష్... అర్చనకు ఫోన్ చేసి గొడవ పడ్డాడు. ఈ విషయం అర్చన తల్లిదండ్రులకు చెప్పి ఏడ్చింది. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లాక తీవ్ర మనోవేదనతో ఉన్న అర్చన బాత్‌రూంలోకి వెళ్లి చీరతో ఉరివేసుకుంది. పక్కింటి వారు గుర్తించి ఉరి నుంచి అర్చనను విడదీయగా అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న కొద్ది సేపటికే మరణించింది. అల్లుడు వినేష్ వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వినేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

ఏడాది క్రితం కొడుకును కోల్పోయి..

కృష్ణ–రేణ దంపతులకు కుమారుడు మహేష్, కూతురు అర్చన ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం కుమారుడు మహేష్ భువనగిరి జిల్లాలో అనుమానాస్పదంగా మరణించాడు. అప్పటికే కూతురు అర్చనకు పెళ్లి ఖాయం కావడంతో వివాహం జరిపించారు. పెళ్లి అయిన ఆరు నెలలకే కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరి హృదయాలను కలిచివేసింది.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసై భార్యను కడతేర్చిన భర్తను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాఘవేందర్ కథనం ప్రకారం మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో సయ్యద్ హజరత్‌బీని ఆమె భర్త సయ్యద్ అమీర్ గత నెల 29వ తేదీన హత్య చేసిన విషయం విదితమే. మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వమని అమీర్ తరచూ భార్యతో గొడవపడేవాడు. ఆమె కూలీ డబ్బును బలవంతంగా తీసుకుని మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన అమీర్.. మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. ఆమె నిరాకరించడంతో అదేరోజు అర్ధరాత్రి హత్య చేసి పారిపోయాడు. దీనిపై మృతురాలి తండ్రి ఖాసీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శివునిపల్లిలో అమీర్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

కిడ్నాప్ కేసులో మరో ఆరుగురు..


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిట్యాల: మండలంలోని గిద్దె ముత్తారం గ్రామానికి చెందిన మామిడి సమ్మయ్యను భూతగదాల విషయంలో ఇటీవల కొందరు కిడ్నాప్ చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న చిట్యాల పోలీసులు.. వారం రోజుల నుంచి బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించారు. శుక్రవారం గట్టు రాజు, అరెల్లి అఖిల్, మల్లెపు శ్రీకాంత్, అజ్మీరా నవీన్, హట్కార్ రాజు, లాడెళ్ల అనిల్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 6 సెల్ ఫోన్‌లు, రూ.80వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జె. రమేష్ తెలిపారు. కాగా, ఒకరు పరారీలో ఉన్నారని ఎస్సై పేర్కొన్నారు. త్వరితగతిన కేసు ఛేదించిన చిట్యాల సీఐ వేణు చందర్, ఎస్సై రమేష్, సిబ్బంది సిద్దార్థ, నవీన్, వేణును భూపాలపల్లి డీఎస్పీ రాములు, ఎస్పీ కరుణాకర్ అభినందించారు.

ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఘనత..


వరంగల్-1 డిపోలో ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత

- ఆక్యుపెన్సీ రేషియోలో ద్వితీయ స్థానం
- ఆగస్టు 31న రికార్డు స్థాయిలో రూ.2.57 కోట్ల ఆదాయం

హన్మకొండ: రాఖీ పండుగ టీఎస్ ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని సమకూర్చింది. ఆక్యుపెన్సీ రేషియోలో వరంగల్ రీజియన్ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నల్లగొండ రీజియన్ మొదటి స్థానంలో ఉండగా 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో వరంగల్ రీజియన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. రాఖీ పండగ సందర్భంగా ఆర్టీసీ.. వరంగల్ రీజియన్‌లో ప్రత్యేకంగా అదనపు బస్సులు నడిపింది. ఆగస్టు 30న 100 అదనపు బస్సులు, 31న 150 అదనపు బస్సులు నడిపింది. 30న 3.79 లక్షల కిలో మీటర్లు తిరిగి రూ.1.96 కోట్ల ఆదాయం రాబట్టుకోగా, 31న 4.19 లక్షల కిలో మీటర్లు తిరిగి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2.57 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. వరంగల్ రీజియన్‌లో 9 డిపోలుండగా సగటున 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో ప్రయాణికులను చేరవేయగా, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, భూపాలపల్లి, పరకాల, జనగామ డిపోలు 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించాయి.

వరంగల్–1 డిపో ఆల్‌టైం రికార్డు..

టీఎస్ ఆర్టీసీ వరంగల్–1 డిపో ఆల్‌టైం రికార్డు సాధించింది. డిపో బస్సులు 68,966కిలో మీటర్లు తిరిగి రూ.45.48 లక్షలు సాధించి డిపోల వారీగా ఆదాయంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత మాట్లాడుతూ డిపో ఉద్యోగులు అంకితభావంతో పని చేయడంతోనే ఈ రికార్డు సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, డిపో మేనేజర్ వి.వెంకటేశం, అసిస్టెంట్ మేనేజర్లు సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాఖీ పౌర్ణమి రోజు అత్యధిక ఆదాయం వచ్చిన సందర్భంగా ఆర్టీసీ హనుమకొండ డిపోలో ఉద్యోగులు సంబురాలు జరుపుకున్నారు. ఆగస్టు 31న హనుమకొండ డిపో రూ.30,39,164 ఆదాయాన్ని రాబట్టుకుంది. దీంతో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భాను కిరణ్, డీఎం బి.ధరం సింగ్, పాల్గొన్నారు.

ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారుపేరు

- కమాండెంట్ కల్నల్ అజయ్ నంద కందూరి


క్యాడెట్ల లగేజీని పరిశీలిస్తున్న ఎన్‌సీసీ కమాండెంట్

మామునూరు : ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారుపేరని తెలంగాణ ఎన్‌సీసీ 10వ బెటాలియన్ కమాండెంట్, కల్నల్ అజయ్ నంద కందూరి అన్నారు. శుక్రవారం ఖిలావరంగల్ మండలం మామునూరులోని పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపును ప్రారంభించారు. ఈనెల 01 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్న క్యాంపునకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 600 మంది క్యాడెట్లు చేరుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్, కల్నల్ అజయ్ నంద కందూరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ ద్వారా దేశానికి కూడా సేవ చేయొచ్చన్నారు. ప్రతి క్యాడెట్ పోటీతత్వంతో శిక్షణలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సదానందం, సుహాస్ కదం, రాధాకృష్ణ, ప్రవీణ్, రాజయ్య, అనిల్, సజని, సౌరస్య, సతీష్, సందీప్, ఇజాజ్, పవర్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, పుత్లిబాయ్, కుమారస్వామి, సురేందర్, సతీష్ పాల్గొన్నారు.

దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణ గౌడ్


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: హక్కుల సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ నెల 10న జరిగే బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పాటించాలన్నారు. దామాషా ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలకు అవకాశాలు కల్పించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 60 సీట్లు కేటాయించాలనే డిమాండ్‌తో ఈ నెల 10న హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో బీసీ సింహ గర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కూరపాటి నారాయణ మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు ప్రైవేట్ కంపెనీల్లా తయారయ్యాయని దుయ్యబట్టారు. బీసీ వర్గాలను దూరం పెట్టిన రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం సింహగర్జన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజమౌళి, నాయకులు చందా మల్లయ్య, కష్ణమూర్తి, పల్లెపు సమ్మయ్య, చిర్ర రాజు గౌడ్, తంగళ్లపల్లి రమేష్, తాళ్ల సంపత్ కుమార్ మేరు, బచ్చు ఆనందం పాల్గొన్నారు.

జ్వరాల బారిన టీఎస్‌ఆర్‌డీసీ విద్యార్థినులు

- ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స
- సాధారణమేనని వైద్యుల ధ్రువీకరణ


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కరీమాబాద్: వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలోని పలువురు విద్యార్థినులకు రెండు రోజులుగా జ్వరం వస్తోంది. దీంతో ప్రిన్సిపాల్ సురేశ్.. జిల్లా వైద్యాధికారులకు సమాచారం అందించి కళాశాలలో వైద్యశిబిరం నిర్వహించడమే కాకుండా సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం 26 మందిని ఎంజీఎంకు తరలించి పరీక్షలు చేయించారు. రిపోర్టులన్నీ నార్మల్‌గా రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, విద్యార్థినులకు సాధారణ జ్వరమే ఉందని, చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేస్తామని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు.

చోరీ చేసి.. చేతికి చిక్కి..

ఉమ్మడి జిల్లా వ్యాపంగా 8 మంది అరెస్ట్

- పలు దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన దొంగలు
- వివరాలు వెల్లడించిన పోలీసులు


ధర్మసాగర్:వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రావు

ధర్మసాగర్: జల్సాలకు అలువాటు పడి చోరీలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్మసాగర్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ కె శ్రీధర్ రావు వివరాలు వెల్లడించారు. రెండు మూడు రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాలలో పార్క్ చేసిన ట్రాక్టర్ బ్యాటరీల చోరీ ఘటనలపై యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయిపేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అంబాల మహేష్, కుమ్మరి ప్రవీణ్, భాస్కకుల అఖిల్, మారపాక అనూప్ కుమార్.. ట్రాక్టర్ బ్యాటరీలను చోరీ చేసి పారిపోతున్నారు. ఇది గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రూ. 50 వేల విలువైన 6 బ్యాటరీలు, ఒక గ్యాస్ సిలిండర్, ఒక టీ ఫ్లాస్క్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు. సమావేశంలో ఎస్ఐలు బి రాజు, పి ఫిలిప్ రాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురవిలో మరో వ్యక్తి..

కురవి: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన మామిడి గోపి ఈనెల 28వ తేదీన కురవిలోని గంగమ్మ తల్లి ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. అదే విధంగా గత జూన్ 16వ తేదీన మండలంలోని తాట్య తండాలో హనుమాన్ ఆలయం, కురవిలోని రామాలయంలో వరుస చోరీలకు పాల్పడ్డాడు. దీనిపై ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం దర్యాప్తు చేపట్టి గోపిని శుక్రవారం అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తగూడలో మహిళలు..

కొత్తగూడ: ముగ్గురు మహిళలు చోరీ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంలోని ‘నానో’ బట్టల షాపులో దుస్తులు కొనుగోలు చేసేందుకు ముగ్గురు మహిళలు వచ్చారు. ఇద్దరు మహిళలు దుస్తులను పరిశీలిస్తున్నట్లు నటించగా.. మరో మహిళ చీరలను కట్టుకుంది. ఈ ఘటనను సీసీ కెమెరాలో గమనించిన షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో షాపు వద్దకు చేరుకున్న ఎస్సై నగేష్ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. రద్దీగా ఉండే షాపులను టార్గెట్‌గా చేసుకుని వీరు చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్సై తెలిపారు.


హసన్‌పర్తి : శంకర్ అరెస్ట్‌ను చూపుతున్న ఏసీపీ

హసన్‌పర్తిలో ఇంకో వ్యక్తి..

హసన్‌పర్తి : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి... కాపర్ వైర్లు చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏసీపీ డేవిడ్ రాజు కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన చిలువేరు శంకర్ జల్సాకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో హసన్‌పర్తి, ఎల్కతుర్తి, ధర్మసాగర్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ నిర్మానుష్య ప్రదేశాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను చోరీ చేస్తున్నాడు. ఈ క్రమంలో బాహుపేట క్రాస్‌వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో శంకర్ ఆటోను ఆపకుండా వెళ్లాడు. దీంతో పోలీసులు ఆటోను పట్టుకుని విచారించగా కాపర్ వైర్లు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అనంతరం శంకర్ వద్ద నుంచి రూ.38 వేలు విలువైన కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ డేవిడ్ రాజు చెప్పారు. కాగా, శంకర్ 14 ఏళ్ల నుంచి చోరీలకు పాల్పడుతున్నట్లు డేవిడ్ రాజు తెలిపారు. సమావేశంలో సీఐ గోపి, ఎస్సై రాజు, అశోక్, కానిస్టేబుల్ క్రాంతికుమార్, ఏఏవో సల్మాన్ పాషా నగేష్ తదితరులు పాల్గొన్నారు.